క్లుప్తంగా

వసతి గృహాల తనిఖీ

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జికె.ప్రత్యూష కుమారి గణేష్ చౌక్ సమీపంలోని ప్రభుత్వ బాలికల, ప్రభుత్వ బీసీ సంక్షేమ కళాశాల విద్యార్థినుల వసతి గృహాలను బుధవారం సందర్శించారు. ఆ వసతి గృహాల పరిసరాలను, వసతులను పరిశీలించారు. పరిసరాలను మరింత పరిశుభ్రంగా ఉంచాలని వసతిగృహం అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు కలి్పంచే వసతుల్లో ఎలాంటి లోటు చేయరాదని సూచించారు. మరుగుదొడ్ల తలుపులు సరిగ్గా లేకపోవడంతో, వాటిని సరిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం బాలికలతో కొంతసేపు మాట్లాడారు.

పోషకాహారంపై అవగాహన


ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ దీపిక

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాక్ గౌతమీనగర్‌లో బుధవారం హిందూస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభాత్ పోషన్‌సాథీలో భాగంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారానికి సంబంధించిన వంటకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో లభించే పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను, బాలామృతంతో వివిధ రకాలైన వంటకాలను చేసి ప్రదర్శించారు. కిశోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. సరైన పోషణ–అందరికీ అందుబాటులో ఆరోగ్యమైన ఆహారం అనే ప్రతిజ్ఞ చేశారు.

నేడు కాంగ్రెస్ పాదయాత్ర

రాజమహేంద్రవరం సిటీ: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు ఏడాది పూర్తయిన సందర్భంగా పీసీసీ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలో గురువారం పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ తెలిపారు. స్థానిక కృష్ణానగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గురువారం మధ్యాహ్నం కోటగుమ్మం నుంచి డీలక్స్ సెంటర్ వరకు జరిగే పాదయాత్రలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

వ్యర్థాల తొలగింపు


చెత్తను తొలగింపును పర్యవేక్షిస్తున్న మదర్ థెరిసా సేవాసంస్థ సభ్యులు

కడియం: దుళ్ల పంచాయతీలో బుధవారం మదర్ థెరిసా సేవాసంస్థ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. దుళ్ల బైపాస్ రోడ్డు శివారు నుంచి ఏడిద వైపు ఆర్అండ్‌బీ రోడ్డులో చెత్తా చెదారం పేరుకుపోయింది. దానినుంచి వచ్చే దుర్వాసనతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన స్థానిక థెరిసా సేవాసంస్థ పొక్లెయిన్, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించింది. కార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తాతపూడి బాబీ మాట్లాడుతూ థెరిసా సేవా సంస్థ సేవలను అభినందించారు. కార్యక్రమంలో సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	ఖుషి
సూర్యమినీ	దినస్-2
సూర్యప్యాలెస్	జవాన్
స్వామి	ఖుషి
శివజ్యోతి	మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
అనుశ్రీ	మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
రాజా	జవాన్
అశోక	జైలర్
ఊర్వశి	జవాన్
రంభ	దినస్-2
మేనక	బెదురులంక 2012
అప్సర	జవాన్
నామవరం	
వీఎస్ మహల్	జవాన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	జవాన్
కడియం	
వెంకటసూర్య	జవాన్

బాలాజీపేట రోడ్డుకు మోక్షం

- చురుకుగా మరమ్మతులు
- వాహనచోదకుల హర్షం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగర పాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్ బాలాజీపేట రోడ్డుకు మోక్షం లభించింది. రూ.7.80 లక్షలతో నగరపాలకసంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి చేసి రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. దీనిపై వాహనచోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ రోడ్డులో భారీ వాహనాలు యథేచ్ఛగా తిరగడంతో గోతులు మరింత పెద్దగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందారు.

వర్షం కురిస్తే..

వర్షం కురిస్తే చాలు బాలాజీపేట రోడ్డు గోతులమయంగా మారేది. రోడ్డు వేసిన నేల పొలంబీడు భూములు కావడంతో గతంలో తరచూ గోతులు పడుతుండేవి. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు గోతులకు శాశ్వత పరిష్కారంగా ఇనుప ఊచల చట్రంతో సీసీ రోడ్డు కింద వేస్తున్నారు. సీసీ రోడ్డు వేసిన ప్రాంతాలలో రోడ్డు బాగానే ఉంది. మిగిలిన ప్రాంతాలలో మాత్రం రోడ్డు గోతులుగా మారుతోంది. ఇప్పుడు బీటీ రోడ్డుపై పడిన గోతులను ఇనుప చట్రాలు వేసి ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. సుమారు రూ.7.80 లక్షలతో మరమ్మతులు చేపడుతున్నామని, నాణ్యతా ప్రమాణాలు పూర్తిస్థాయిలో పాటిస్తున్నామని నగరపాలక సంస్థ ఏఈ శ్రీధర్ 'సాక్షి'కి తెలిపారు.


బాలాజీపేటరోడ్డులో జరుగుతున్న మరమ్మతులు


శ్లాబ్ మాదిరిగా వేస్తున్న ఇనుప చట్రాలు


పనిలో నిమగ్నమైన కార్మికులు

భారీ వాహనాలే కారణం!

బాలాజీపేట రోడ్డులో తరచూ ఇసుక లోడుతో భారీ వాహనాలు తిరగడం వల్లనే రోడ్డు ధ్వంసమైపోతోంది. సీసీ రోడ్లు వేసినప్పటికీ భారీ వాహనాల రాకపోకలతో అధ్వానంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీ వాహనాల రాకపై ఆంక్షలు విధించాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న సులభ్ కాంప్లెక్స్ తొలగింపు


పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్లు గూడూరి రాధిక, బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు తెలిపిన సమస్యకు వెంటనే పరిష్కారం లభించిందని శ్రీగౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. వివరాలు ఇలా..స్థానిక 49వ డివిజన్‌లో 1997లో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. దాని స్థానంలో ప్రజలకు ప్రయోజనంగా ఉండేలా ఏదైనా నిర్మించాలని స్థానికులు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఈ విషయం తెలిపారు. దీంతో బుధవారం పాతబడిన సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చివేశారు. ఆ పనులను గూడూరి రాధిక, శ్యామల, పార్టీ నాయకులు గారా చంటిబాబు, తగరం సురేష్ పరిశీలించారు.

విద్యార్థులకు భగవద్గీత పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి

సీటీఆర్ఐ: భగవద్గీత పఠనం వల్ల మేధాశక్తి పెరుగుతుందని శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలోని శ్రీరాధాకృష్ణ మందిరంలో బుధవారం పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. విజేతలకు శ్రీభక్తి కంకణ బనమహారాజ్, ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా సురేష్ దాస్ బ్రహ్మచారి, పిచ్చుక వెంకట రాంబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ పూర్వ అధ్యక్షుడు పీవీఎస్.కృష్ణారావు పాల్గొన్నారు. గురువారం రాధాకృష్ణ మందిరంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు.

దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేత



వీల్ చైర్ అందజేస్తున్న వాసు, రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ కార్పొరేటర్ అజరపు వాసు అన్నారు. స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పి.గన్నవరం మండలం బెల్లంపూడి గ్రామానికి చెందిన రొక్కాల సందీప్ కుమార్‌కు రూ .11,700ల విలువైన అత్యాధునిక వీల్ చైర్‌ను బహూకరించారు. వీల్ చైర్ లేకపోవడంతో 27 ఏళ్ల సందీప్ కుమార్‌ను చేతులతో మోయడం చాలా భారంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర సేవలు టీవీ, పేపర్ల ద్వారా చూసి పి.గన్నవరానికి చెందిన తండ్రి శాంతారావు ఫోన్ ద్వారా సంప్రదించగా వీల్ చైర్ సమకూర్చినట్లు స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు తెలిపారు. దివ్యాంగులకు, చెవిటి మెషీన్, వీల్ చైర్లు, ట్రై సైకిల్ కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థను నేరుగా సంప్రదించవచ్చని రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ విశ్రాంత ఉద్యోగి పులుపకూర ప్రకాశరావు, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ఇలియాస్, హరికృష్ణ భరత్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కాపవరంలో గడప గడపకూ..

మధురపూడి: పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, అప్పుడే మరింత అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో గ్రామాలన్నీ అభివృద్ధికి చిరునామాగా నిలిచాయన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 20 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చామన్నారు. కాపవరంలో త్వరలో పట్టాల పంపిణీ చేస్తామన్నారు. గ్రామంలో రూ.51 లక్షలతో సీసీ డ్రైనేజీలు, రూ.47 లక్షలతో సీసీ, గ్రావెల్ రోడ్లు నిర్మించినట్టు తెలిపారు. మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి 8 గంటల వరకూ సుమారు 300 గడపలు తిరిగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్ జాజుల రాము, కోరుకొండ పీఏసీఎస్ చైర్మన్ మారిశెట్టి నాయుడు, హితకారిణీ సమాజం డైరెక్టర్ కాలచర్ల శివాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరంగం శ్రీను, గుగ్గిలం భాను, కొండేటి నార్జున, నాగా రమేష్ పాల్గొన్నారు.


కాపవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

సీటీఆర్ఐ: గోపాలనగర్‌లోని శ్రీకృష్ణుని దేవాలయంలో గురువారం నుంచి ఐదు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు పక్కుర్తి సత్తిబాబు, టీటీడీ వేద పండితుడు బాపూజీ శర్మ తెలిపారు. మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం ఉదయం అభిషేకం, కలశస్థాపన, సాయంత్రం దీపారాధన జరుగుతుందని తెలిపారు. 8న స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. 9న వేద పండితుల ఆశీర్వాదం, ఉట్టి ఉత్సవం, 10న గోపూజ, తులసి అర్చన, 11న పుష్పయాగం జరుగుతాయన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నక్కెళ్ళ బాబూరావు, గౌరవ సలహాదారులు బోయిడి చిన్నారావు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

రాజమహేంద్రవరం రూరల్: గుర్తుతెలియని కారు ఢీకొన్ని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. హుకుంపేట జాతీయ రహదారిపై బుధవారం ఆ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కోలమూరు ప్రాంతానికి చెందిన రామేశ్వరపు భార్గవి, తన తల్లి వెంకటలక్ష్మితో ద్విచక్ర వాహనంపై హుకుంపేట జాతీయ రహదారిపై వెళుతోంది. ఆమెను వెనుక నుంచి గుర్తుతెలియని కారు అతివేగంగా ఢీకొంది. ఈ ఘటనలో వెంకటలక్ష్మి తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈనేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


రాధాకృష్ణుల వేషధారణలో గురుకులం విద్యార్థులు


కడియంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న గిరజాల బాబు, రామకృష్ణ తులసి


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం వేణుగోపాలస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పల్లకీసేవ, ఊరేగింపు నిర్వహించారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలోని వందమంది విద్యార్థులు ఉట్టి కొట్టారు. గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్, ప్రిన్సిపల్ గుర్రయ్య, కమిటీ సభ్యులు సోమసుందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కడియం: గ్రామంలోని గోశాలలో బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి దంపతుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. శివాలయం కమిటీ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి, కమిటీ సభ్యులు నేతృత్వంలోని ఉత్సవాలు అలరించాయి. తొలుత ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. బాలకృష్ణులు, గోపికలు వేషధారణ పోటీ నేత్రపర్వంగా సాగింది. పాల్గొన్న చిన్నారులకు, విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఆద్యంతం ఆకట్టుకుంది. అంతకు ముందు గోశాలలోని కృష్ణుని ఆలయంలో పూజలు నిర్వహించారు.

పాలనాంశాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఏపీ ఎస్ఐఆర్‌డీఅండ్ పీఆర్ డైరెక్టర్ మురళీ

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అన్నిరకాల పరిపాలనాపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీఅండ్‌పీఆర్) డైరెక్టర్ జె.మురళి అన్నారు. స్థానిక రివర్‌బే సమావేశ మందిరంలో తూర్పుగోదావరి జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న రెండో దశ శిక్షణను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం, 73వ రాజ్యాంగ సవరణ, ఇతర న్యాయపరమైన అంశాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. జిల్లా కార్యాలయ మాన్యువల్, ఎన్ఆర్ఈజీఎస్, లేఅవుట్ల అనుమతులు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్వమిత్ర, డ్రాఫ్టింగ్ తదితర అంశాలను వివరించారు. కిందిస్థాయి నుంచి జిల్లా, ఆపై స్థాయి వరకు పరిపాలనా అంశాల్లో జరిగే మార్పులను గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసే జీవోలు, మెమో సర్క్యులర్ల గురించి తెలుసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ పరిపాలనాపరమైన అంశాలపై పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. డీపీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ ఆరమ్‌స్ట్రాంగ్, మాస్టర్ ఆఫ్ ట్రైనీలు పాల్గొన్నారు.

పింఛన్ల మంజూరుకు అర్హతే ప్రామాణికం


పింఛన్ పంపిణీ చేస్తున్న మజ్జి అప్పారావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: అర్హతే ప్రామాణికంగా జగన్ పాలనలో పేదలందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు ఆ పార్టీ నగర బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ మజ్జి నూకరత్నం అన్నారు. అన్నపూర్ణమ్మపేటల డయాలసిస్ పేషెంట్ కొట్టాడ కనకరాజుకి వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.పదివేలను అందజేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 31వ డివిజన్‌కు విచ్చేసిన ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు సమస్యను తెలియజేశానన్నారు. ఆయన వెంటనే ముఖ్యమంత్రి జగన్ ద్వారా పెన్షన్ మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో మస్తాన్, వెల్ఫేర్ సెక్రెటరీ విజయ, వలంటీర్ ప్రేమలత పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో ఇంటికే పథకాలు

- సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్
- వివిధ సమస్యలపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 39వ డివిజన్‌లోని లింగంపేట కమ్యూనిటీ హాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన సమస్యలపై డివిజన్ ఇన్‌చార్జి, కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్షించారు. డివిజన్‌లో స్థానికుల నుంచి వచ్చిన సమస్యలు, సచివాలయ సేవలు తదితర వాటిపై సమీక్షించారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ అందిస్తున్న సేవలకు తెలుగుదేశం పార్టీ నాయకులు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. తాము ప్రతి డివిజన్‌లో గడప గడపకూ కార్యక్రమం ద్వారా పర్యటించి, సమస్యలు తెలుసుకుని వాటిని ఆయా అధికారులకు తెలియచెప్పి పరిష్కరించడం జరుగుతోందన్నారు. ప్రతి ఇంటిలోనూ తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన సీఎం జగన్‌ను ఇతర రాష్ట్రాల నాయకులు సైతం మెచ్చుకుంటున్నారన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే అందిస్తున్నారని, చివరి లబ్ధిదారు సైతం మిగిలిపోకూడదని వారికి సైతం మేలు చేయాలని గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక , ట్రేడ్ యూనియన్ నాయకులు సప్పా ఆదినారాయణ, ఆర్యాపురం ఆలయ ట్రస్ట్ కమిటీ డైరెక్టర్ విస్సారపు కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి


పురుషోత్తపట్నంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురంలో డ్వాక్రా మహిళలు, ఎన్ఆర్ఈజీఎస్ మహిళలతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకూ రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మహిళలను మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రూ.3 వేల కోట్లు డ్వాక్రా మహిళలకు అందించారని గుర్తు చేశారు. మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మనమందరం అండగా ఉండాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, సర్పంచ్ సరిపల్లి అనురాధ, ఎంపీటీసీ ఊసే ఏసమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు.